క్లుప్తంగా

జగిత్యాల నుంచి పొలాస వరకు పాదయాత్ర



పాదయాత్రగా ఆలయానికి చేరుకున్న భక్తులు

జగిత్యాలరూరల్: తాము కోరిన కోర్కెలు తీర్చాలని జగిత్యాల నుంచి జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామ శివారులోని సహస్ర లింగాల ఆలయం వరకు జగిత్యాలకు చెందిన ఆవారి భార్గవేంద్ర, విద్య, ఠాకూర్ రోజారాణి, కుమారిదుర్గ, ఠాకూర్ స్వప్నకుమార్, వరుణ్‌సింగ్ దంపతులు పాదయాత్ర చేపట్టారు. అనంతరం ఆలయంలో మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు నలమాసు గంగాధర్, భక్తులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం



విరాళం అందిస్తున్న గౌతమ్‌కుమార్‌–మౌనిక దంపతులు

రాయికల్: మండలంలోని భూపతిపూర్ లక్ష్మీ నృసింహస్వామి ఆలయ అభివృద్ధి కోసం మెట్‌పల్లికి చెందిన బర్ల గౌతమ్‌కుమార్, డాక్టర్ మౌనిక దంపతులు సోమవారం రూ.50 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కాకుస్తం వెంకటకృష్ణ ఘనంగా సన్మానించి స్వామివారి తీర్థప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సంకోజి మహేశ్, వెంకటరమణ, బోగ రమేశ్, జక్కుల రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

విషాహారం తిని 18 గొర్రెలు మృతి



మృతిచెందిన గొర్రెలు

రాయికల్: మండలంలోని అయోధ్య గ్రామానికి చెందిన ఒర్రె మల్లయ్య, ఒర్రె రమేశ్, ఒర్రె గంగరాజం అనే యాదవ రైతులకు చెందిన 18 గొర్రెలు సోమవారం విష ఆహారం తిని మృతి చెందాయి. సుమారు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతులు వాపోయారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించాలని తాజా మాజీ సర్పంచ్ ఎడ్మల జీవన్‌రెడ్డి కోరారు. మృతిచెందిన గొర్రెలకు మండల పశు వైద్యాధికారి శ్రీనివాస్ పంచనామా చేశారు.

ఓటేసిన స్వతంత్ర అభ్యర్థులు



ఆరే రాజేందర్



సాయికృష్ణయాదవ్

మల్లాపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ ఎంపీ స్థానానికి పోటీ చేసిన ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు సోమవారం మల్లాపూర్ మండలంలోని రాఘవపేట, గుండంపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాఘవపేటలో స్వతంత్ర అభ్యర్థి ఎంపీటీసీ ఆరే రాజేందర్, గుండంపల్లిలో స్వతంత్ర అభ్యర్థి గుయ్య సాయికృష్ణయాదవ్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు చేరుకున్న ఈవీఎంలు

కోరుట్ల: కోరుట్ల నియోజకవర్గంలో 262 పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు, ఎన్నికల సిబ్బంది, సామగ్రి తరలించేందుకు 26 రూట్లు ఏర్పాటు చేశారు. కాగా సోమవారం పోలింగ్ ముగిసిన అనంతరం ఆయా రూట్ల ద్వారా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల్లో పోలీసు బందోబస్తు మధ్య ఈవీఎంలు కోరుట్లలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ తరలిస్తున్నారు. ఈవీఎంలను ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలో భద్రపరుస్తున్నారు.

ఓటుహక్కు సద్వినియోగం చేసుకున్నాం

పెగడపల్లి: ఎంపీ ఎన్నికల్లో తొలిసారి తమ ఓటుహక్కు సద్వినియోగం చేసుకున్నామని మండలంలోని ఆరవెల్లికి చెందిన పలువురు యువతీ, యువకులు పేర్కొన్నారు. సోమవారం ఎన్నికల్లో తొలిసారి ఓటేసిన వీరిని సాక్షి పలకరించగా ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధంలాంటిదని, తాము బాధ్యతగా భావించి ఓటు వేశామని, ఇక నుంచి ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఎక్కడున్న బాధ్యతగా తాము ఓటేస్తామని తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

- బారులు తీరిన ఓటర్లు
- పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు
- కొన్ని గ్రామాల్లో స్వల్ప ఉద్రిక్తత

జగిత్యాలరూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికలు చిన్నచిన్న ఘటనలు మినహా ప్రశాంతంగా జరిగాయి. సోమన్‌పల్లిలో పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించడంతో 20 నిమిషాలు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. దీంతో ఓటర్లు బారులు తీరారు. ప్రధానపార్టీ నాయకులు పోలింగ్ స్టేషన్ సమీపంలో ప్రచారం చేసేందుకు పోటీ పడటంతో పలు చోట్ల స్వల్ప ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. అక్కడక్కడ రెండు వర్గాల మధ్య చిన్న చిన్న ఘటనలు మినహా ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి.

మొదటిసారి ఓటు వేసిన యువతులు

మండలంలో మొదటిసారిగా ఓటు హక్కు పొందిన యువతీ, యువకులు ఉత్సాహంగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం 7 గంటల నుండే యువకులు పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ కట్టి తమ ఓటు హక్కును వినియోగించుకుని ఆనందం వ్యక్తం చేశారు.

రాయికల్: పట్టణంతో పాటు మండలంలోని 32 గ్రామాల్లో సోమవారం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మూటపల్లి, మైతాపూర్ గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించడంతో స్పందించిన ఎన్నికల అధికారులు వెంటనే సరిచేయడంతో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. పలు పోలింగ్ కేంద్రాలను బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్దన్, కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి, బీజేపీ నియోజకవర్గ నాయకులు బోగ శ్రావణి, జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ పరిశీలించారు.

కోరుట్ల/కోరుట్ల రూరల్: కోరుట్ల పట్టణంతో పాటు మండలంలో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని 54 కేంద్రాలు, మండలంలోని 35 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పోలింగ్ నిర్వహించారు. పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఓటర్లకు మోడల్ ఈవీఎంలను చూపించి తమ.తమ పార్టీ గుర్తులపై ఓటు వేయాల కోరారు.కోరుట్ల, మాదాపూర్, పైడిమడుగు గ్రామాల్లో పోలింగ్ సరళిని నిజామాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్దన్ పరిశీలించారు. కోరుట్లలో పోలింగ సరళిని కాంగ్రెస్ అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డి నాయకులను అడిగి తెలుసుకున్నారు. పోలీసులు బందో బస్తు ఏర్పాటు చేశారు.

మెట్‌పల్లిలో...

మెట్‌పల్లి: పట్టణంలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ప్రతీ కేంద్రం వద్ద ఉదయం ఏడు గంటల నుంచే ఓటర్లు బారులు తీరారు. ఎమ్మెల్యే సంజయ్ ఎస్సారెస్పీ క్యాంపు,



కల్లెడ మోడల్ పోలింగ్ కేంద్రంలో ఓటు వేసిన యువకులు



వెల్గటూర్‌లో ఓటేసిన యువకులు



ధర్మపురిలో బారులుదీరిన ఓటర్లు

మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత మండల పరిషత్‌లోని పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో ఓటింగ్ ప్రశాంతంగా ముగిసింది. బీర్‌పూర్ మండలం చిన్నకొల్వాయిలో మధ్యాహ్నం 12 గంటల వరకే 100 శాతం పోలింగ్ జరిగింది. సారంగాపూర్ మండలంలో 76.40 శాతం బీర్‌పూర్‌లో 76.50 శాతం ఓట్లు నమోదయ్యాయి. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి కోనాపూర్ , పెంబట్ల, లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లో ఓటింగ్ సరళిని పరిశీలించారు.

మేడిపల్లి: మేడిపల్లి వ్యాప్తంగా ఓటింగ్ ప్రశాంతంగా జరిగింది.మండలంలో 49 పోలింగ్ కేంద్రాలలో ఉన్నాయి. కేవలం గోవిందారం గ్రామంలో భూత్ నంబరు 43లో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. గ్రామానికి చెందిన కారోబర్ ఇతర పార్టీల వారికి ఓటువేయలని చెప్పాడని కాంగ్రెస్ నాయకులు రిటర్నింగ్ అధికారికి పిర్యాదు చేయగా కారోబర్ నవీన్ అక్కడ నుండి అధికారులు పంపేశారు. వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆదిశ్రీనివాస్ మండలంలో పర్యటించి పోలింగ్ సరళి గురి కాంగ్రెస్ శ్రేణులను అడిగి తెలుసుకున్నారు.

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.సోమవారం ఉదయం 7 గంటల నుండే పోలింగ్ కేంద్రాలకు పోటేత్తిన ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.బండలింగాపూర్ పోలింగ్ కేంద్రం నెం.41 లో ఈవీఎం మొరాయించింది.దీంతో దాని స్థానంలో కొద్దిసేపటి తర్వాత అధికారులు మరో ఈవీఎంను ఏర్పాటు చేసి యథావిధిగా పోలింగ్ కొనసాగించారు.

కథలాపూర్: మండలంలోని గ్రామాల్లో సోమవారం పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో 19 గ్రామాలకు గాను 41 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ఆయా పార్టీల నాయకులు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. అంబారిపేట గ్రామానికి చెందిన గంగొని మహేశ్ అనే యువకుడు ఓటు వేసి దుబాయి దేశం వెళ్లారు. కథలాపూర్‌కు చెందిన ఆర్టీసీ కండక్టర్ లక్ష్మీనారాయణ, డ్రైవర్ రాజేశ్ డ్యూటీలో ఉండి పోలింగ్ కేంద్రానికి సమీపంలో బస్సును నిలిపి ఓటు వేశారు.పోలింగ్ కేంద్రాలను మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు పరిశీలించారు.

ఇబ్రహీంపట్నం: మండలంలో పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఇబ్రహీంపట్నంలో రాజరాపు రాజు (95) సంవత్సరాల వృద్ధురాలు తన ఓటు హక్కును వినియోగించుకుంది. యామాపూర్‌లో బత్తుల తిరుమల తన నెల రోజుల బాబుతో వచ్చి ఓటు వేసింది.

కొండగట్టు: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సోమవారం కొడిమ్యాల మండల వ్యాప్తంగా 74 శాతం ఓటింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారి రాజమణి తెలిపారు.

గొల్లపల్లి: ధర్మపురి నియోజకవర్గంలో పార్లమెంట్



చల్‌గల్‌లో బారులు తీరిన ఓటర్లు



రాయికల్: మహిళా పోలింగ్ కేంద్రంలో ఓటర్లు

ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎలాంటి చెదురుముదురు ఘటనలు కూడానమోదు కాకుండా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పలు గ్రామాల్లో ప్రభుత్వ ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీ అన్ని మండలాల్లో పోలింగ్ సరళిని పరిశీలించారు.

ధర్మపురి: ధర్మపురి మండలంలో పోలింగ్ ప్రశాంతంగా సాగింది. ధర్మపురి ఎన్నికల రిటర్నింగ్ అధికారి దివాకర ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టారు. మండల వ్యాప్తంగా 73.50 శాతం ఓటింగ్ నమోదైంది.

బుగ్గారం: బుగ్గారం మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండల వ్యాప్తంగా 72.66 శాతంగా పోలింగ్ నమోదైంది.

మొరాయించిన ఈవీఎంలు

పెగడపల్లి: మండలంలో పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఈవీఎంలు మొరా యించాయి. పెగడపల్లిలోని మోడల్ పోలింగ్ కేంద్రంలో కంట్రోల్ యూనిట్ (సీయూ)లో సాంకేతిక లోపంతో అరగంట ఆలస్యంగా పోలింగ్ మొదలైంది. దోమలకుంటలోని 250 పోలింగ్ బూత్‌లో ఈవీఎంలో లోపంతో వల్ల సుమారు 40 నిమిషాలు పోలింగ్ నిలిచిపోయింది. మండలంలో పోలింగ్ శాతం తగ్గింది. అసెంబ్లీ ఎన్నికల్లో మండల వ్యాప్తంగా 79 శాతం పోలింగ్ నమోదైతే సోమవారం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతం 73.85 శాతం నమోదైంది.

మల్యాల: మండలంలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పలు పోలింగ్‌కేంద్రాలను సందర్శించి, పోలింగ్ సరళిని పరిశీలించారు. మండలంలో సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ 65 శాతం నమోదైంది.

చిన్నకొల్వాయిలో వంద శాతం పోలింగ్



చిల్వకొల్వాయిలో సంతోషం వ్యక్తం చేస్తున్న అధికారులు, గ్రామస్తులు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం చిన్నకొల్వాయి గిరిజన గ్రామంలో సోమవారం పార్లమెంట్ ఎన్నికల్లో గ్రామంలో ఓటర్లు 100 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకుని ఆదర్శంగా నిలిచారు. మధ్యాహ్నం 12 గంటల లోపే వంద శాతం పోలింగ్ జరిగింది. ఇక్కడ మొత్తం 110 ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 45 మంది, మహిళలు 65 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల సెక్టోరల్ అధికారి చక్రూనాయక్ తెలిపారు.

ఓటుహక్కు వినియోగించుకున్న అక్కాచెల్లెళ్లు



తొలిసారి ఓటేసిన అక్కాచెల్లెళ్లు హారిక, సామిక

పెగడపల్లి: మండల కేంద్రానికి చెందిన గడ్డల హారిక, సామిక అనే ఇద్దరు అక్కాచెల్లెళ్లు మొదటి సారి ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఇటీవల డిగ్రీ పూర్తి చేసుకున్న వీరు సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఓటేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని, ఓటుహక్కును తాము బాధ్యతగా భావించి ఓటు వేశామని తెలిపారు.

అలసి సొలసి..



జగిత్యాల: నెల రోజులుగా ఎన్నికల ప్రచారంలో బిజీబిజీగా ఉన్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి చివరిరోజు ఓటింగ్ సరళిని పరిశీలిస్తూ అందరినీ అడిగి తెలుసుకుంటూ నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో పర్యటించారు. ఉదయం జగిత్యాల –గొల్లపల్లి రోడ్‌లోని ఓ చిన్నహోటల్‌లో టిఫిన్ చేశారు. మంది మార్బలం లేకుండా ఒక్కరే టిఫిన్ చేయడం అందరినీ ఆకట్టుకుంది.

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు



ఓటేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి

జగిత్యాలటౌన్: దేశ రక్షణ, భద్రత కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని నిజామాబాద్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం జగిత్యాల పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం జీవన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. పార్లమెంటుకు జరుగుతున్న ఎన్నికలు దేశ భద్రత, భవిష్యత్తుకు సంబంధించిన ఎన్నికలని అది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని అన్నారు.

పట్టణంలో ఓటేసిన ప్రముఖులు

పట్టణంలోని అరవింద్‌నగర్‌లోని పురాణిపేట హైస్కూల్‌లో ఎమ్మెల్సీ ఎల్ రమణ కుటుంబ సభ్యులు, నర్సింగ్ కళాశాలలో జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఓటరు తమ ఓటును నిర్భయంగా వినియోగించుకోవాలని కోరారు.

పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, పురాణిపేట హైస్కూల్‌లో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి భోగ శ్రావణి ఓటు వేశారు.



ఓటు వేసిన బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రావణి

జీవన్‌రెడ్డి గెలుపు లాంచనమే



ఓటేసిన చంద్రశేఖర్ గౌడ్ దంపతులు

జగిత్యాలటౌన్: కాంగ్రెస్ అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డి గెలుపు లాంచనమేనని కాంగ్రెస్ నేత, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొల్లపల్లి చంద్రశేఖర్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం జగిత్యాల పట్టణంలోని గీతా విద్యాలయ పాఠశాల పోలింగ్ సెంటర్‌లో చంద్రశేఖర్‌గౌడ్ దంపతులు ఓటు హక్కు వినియోగించుకుని మాట్లాడారు. పోలింగ్ సరళి కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉందన్నారు. ప్రజా నాయకుడు జీవన్‌రెడ్డి ఎంపీగా గెలవడం ఖాయమైందన్నారు.

తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ వైపే..

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపుతారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం కథలాపూర్ మండలం గంభీర్‌పూర్, తాండ్ర్యాల, దూలూర్, దుంపేట, కథలాపూర్ గ్రామాల్లో పోలింగ్ సరళిని పరిశీలించారు. పలువురి ఓటర్లతో మాట్లాడి కాంగ్రెస్ నాయకులతో పోలింగ్ సరళిపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలో ఉంటే సంపూర్ణ అభివృద్ధి జరుగుతుందని ప్రజలు భావించారని, కేంద్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.డీ అజీమ్, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ఆందోళన



రాయికల్: పట్టణంలో సోమవారం పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులు పరుష పదజాలంతో దూషించారని కాంగ్రెస్ నాయకులు ఆందోళన నిర్వహించారు. నాయకులు ఇరువర్గాలకు సర్ది చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

ప్రజల ఆశీర్వాదంతో బీఆర్‌ఎస్ విజయం

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



తొలిసారి ఓటు వేసిన అమ్మాయిలతో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

మల్లాపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదంతో బీఆర్‌ఎస్ విజయం సాధిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం మల్లాపూర్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఆయన పర్యటించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా గత పదేళ్లగా సీఎం కేసీఆర్ ఆహర్నిశలు పనిచేసి తెలంగాణను అన్ని రంగాలలో మొదటిస్థానంలో నిలిపారన్నారు. ఎంపీగా బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి గెలుపు ఖాయమైందన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కాటిపెల్లి సరోజన, వైస్ ఎంపీపీ గౌరు నాగేష్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, ప్యాక్స్ చైర్మన్లు వేంపేట సర్సారెడ్డి, బద్దం అంజిరెడ్డి, నేరేళ్ల మోహన్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

‘ధర్మపురిలో హస్తానిదే హవా’

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: నియోజకవర్గంలో కాంగ్రెస్ హవా కొనసాగిందని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం ఓటింగ్ సమయం ముగిసిన అనంతరం ధర్మపురిలో ఓటర్లతో పాటు నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీలతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారని పెద్దపెల్లి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఉన్న గడ్డం వంశీకి ప్రజలు పట్టం కట్టి, భారీ మెజారిటీ గెలిపిస్తున్నారని ఆశాభావం వ్యక్తం చేసారు. ఆయన వెంట చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్, నాయకులు దినేశ్, వేముల రాజు, కౌన్సిలర్లు వేముల నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా బీరప్ప బోనాలు

కథలాపూర్: మండలంలోని గంభీర్‌పూర్‌లో బీరప్ప బోనాల జాతర ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున భక్తులు గ్రామం నుంచి దేవాలయం వరకు బోనాలతో ఊరేగింపు చేశారు. స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

మొరాయించిన ఈవీఎంలు... నిలిచిన పోలింగ్

రాయికల్: మండలంలోని మైతాపూర్‌లో 40వ పోలింగ్ బూత్‌లో ఈవీఎంలు సోమవారం మొరాయించడంతో సుమారు 20 నిమిషాల పాటు పోలింగ్ నిలిచిపోయింది. ఈ విషయం తెలుసుకున్న అధికారులు మరో ఈవీఎం ఏర్పాటు చేయడంతో పోలింగ్ ప్రారంభించారు. అదే విధంగా మూటపల్లిలో ఈవీఎం బటన్లపై పోలింగ్ ఏజెంట్లు అభ్యంతరం వ్యక్తం చేయడంతో మరో ఈవీఎంలను తీసుకువచ్చి పోలింగ్‌ను ప్రారంభించారు.

కోరుట్లలో..

కోరుట్ల: పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతంలోని 160 నంబర్ పోలింగ్ కేంద్రంలో సాయంత్రం నాలుగు గంటలకు ఈవీఎం మొరాయించింది. దీంతో అధికారులు మరో ఓటింగ్ యంత్రాన్ని ఏర్పాటు చేసేందుకు సుమారు రెండు గంటలు పట్టింది .దీంతో ఓటర్లు అసహనం వ్యక్తం చేశారు. పోలింగ్ కేంద్రంలో తాగు నీరు కూడా లేక ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. మరో ఓటింగ్ మిషన్ ఏర్పాటు చేసిన అనంతరం ఓటు హక్కు వినియోగించుకున్నారు.



మైతాపూర్ లో ఈవీఎం మొరాయించడంతో బారులు తీరిన ఓటర్లు

నకిలీ బంగారం విక్రయించే వ్యక్తికి దేహశుద్ధి



చెట్టుకు కట్టేసి దేహశుద్ధి చేస్తున్న స్థానికులు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ చౌరస్తా వద్ద సోమవారం రాత్రి నకిలీ బంగారం విక్రయించే వ్యక్తికి స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఇతర రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి లక్షెట్‌పేటకు చెందిన ఓ వ్యక్తి వద్ద తక్కువ ధరకు బంగారం విక్రయిస్తానంటూ నమ్మించి రూ.1.20 లక్షల నగదు తీసుకుని మోసం చేసి వచ్చాడు. అన్నపూర్ణ చౌరస్తా వద్ద కూడా ఓ వ్యక్తికి ఒరిజినల్ బంగారం చూపించి నకిలీ బంగారం ఇచ్చే క్రమంలో స్థానికులు బంగారాన్ని గుర్తించి స్థానికులకు తెలపడంతో స్థానికులంతా కలిసి నకిలీ బంగారం విక్రయించే వ్యక్తికి దేహశుద్ధి చేసి చెట్టుకు కట్టేసి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతుండగా అతను వివరాలు వెల్లడించలేదు.

సీబీఎస్‌ఈ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



కార్తీక్



ధ్రితి

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని కేజీఆర్ హైస్కూల్ విద్యార్థులు సీబీఎస్‌ఈ ఎస్సెస్సీ ఫలితాల్లో అత్యంత ప్రతిభ కనబర్చారు. ఎస్ కార్తీక్ 500 మార్కులకు గాను 469, బి.ధ్రితి 466, జె.శ్రీలలిత 465, పూర్ణచంద్ 461, గుండు అభిరామ్ 459, ఎం.అక్షిత 455, బి.చరణ్ 454 మరో 23 మంది 400లకు పైగా మార్కులు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గంగారెడ్డి, డైరెక్టర్ గోవర్దన్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు.